క్లుప్తంగా

బస్సు సౌకర్యం కల్పించాలి



యాటకల్లులో ఆటో దిగుతున్న విద్యార్థులు

ఆస్పరి: మండలంలోని యాటకల్లు గ్రామానికి బస్సుసౌకర్యం కల్పించాలని గ్రామస్తులు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు. యాటకల్లు నుంచి 60 మంది విద్యార్థులు కైరుప్పల, ఆస్పరి,మోడల్ స్కూల్లో చదువుకోవడానికి ఉదయం, సాయంత్రం ఆటోలలో ప్రమాదకర స్థితిలో ప్రయాణిస్తున్నారు. మూడునెలల క్రితం ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ఉదయం, సాయంత్రం కైరుప్పల మీదుగా ఆస్పరికి వచ్చేది. ఒక నెల మాత్రమే బస్సును నడిపి తర్వాత అధికారులు రద్దు చేశారని గ్రామస్తులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు, గ్రామస్తుల సౌకర్యార్థం బస్సు సర్వీసు పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు పీఎం కిసాన్ నగదు జమ

హాలహర్వి: ఈనెల 27వ తేదీన అర్హులైన రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ 14వ విడత ఆర్థిక సాయం జమ అవుతుందని మండల వ్యవసాయ అధికారి శివశంకర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున నగదు జమ అవుతుందన్నారు.

కార్గిల్ అమర వీరులకు నివాళి

ఆలూరు:దేశ రక్షణకు ప్రాణాలర్పించిన అమర వీరులను స్మరించుకోవాలని మాజీ సైనిక ఉద్యోగుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులను స్మరించకుకుంటూ బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. మాజీ సైనిక ఉద్యోగుల సంఘం నాయకులు గోపాల్, పోస్టల్ శ్రీనివాసులు, తోటప్ప, రంగస్వామి, ప్రసాదు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ పనుల పరిశీలన

మద్దికెర: మండల కేంద్రమైన మద్దికెరలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రూ.25 లక్షలతో నిర్మిస్తున్న ప్రహరీ నిర్మాణ పనులు బుధవారం డీఈ శేషయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం పనులు సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ల ఆధ్వర్యంలో పనులు చేయాలని సూచించారు. నిర్మాణ దశలను బట్టి నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు విష్ణు, చంద్ర వెంట ఉన్నారు.

రీసర్వేకు సహకరించాలి

తుగ్గలి: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా నిర్వహించే భూ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ రవి కోరారు. బుధవారం బొందిమడుగుల, ఎద్దుల దొడ్డి, తుగ్గలి గ్రామాల్లో రెవెన్యూ అధికారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. రీసర్వే లో ఎలాంటి రుసుము లేకుండా భూములను సర్వే చేసి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. హద్దులు ఏర్పాటు చేసి భూ హక్కు పత్రాలు ఇస్తారన్నారు. రీ సర్వేకు రైతులందరూ సహకరించాలన్నారు. మండల సర్వేయర్ గాదిలింగప్ప, వీఆర్వోలు కాశీరంగ స్వామి, రెహమాన్ పాల్గొన్నారు.

కాచి వడబోసిన నీటిని తాగాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రస్తుతం ఎల్లెల్సీలో వర్షపు నీరు ఒండ్రుతో కలిసి వస్తోందని పట్టణ ప్రజలు కొళాయిల ద్వారా వచ్చే మంచి నీటిని కాచి వడబోసి చల్లార్చి తాగాలని మున్సిపల్ కమిషనర్ బుధవారం సూచించారు. అదేవిధంగా కలుషిత ఆహారం, చల్లని ఆహార పదార్థాలు తినకూడదన్నారు. ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలని, వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

డ్రాపౌట్స్ నివారించాలి

చిప్పగిరి: మండలంలో డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలలో చేర్పించాలని పీఓ వేణుగోపాల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. బుధవారం మండలంలోని పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలని, విద్యార్థుల వివరాలు స్టూడెంట్ ఫార్మాట్‌లో పొందు పరిచేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

ఉపాధ్యాయులను నియమించాలి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గార్లదిన్నె గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని రాయలసీమ యునైటెడ్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు రఘునాథ్, రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఆఫ్రిద్ కోరారు. ఈ మేరకు బుధవారం ఎంఈఓ ఆంజనేయులును కలిసి వినతి పత్రం అందజేశారు.

విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టాలి

కృష్ణగిరి: ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఏఎంఓ ప్రసాద్ అన్నారు. మండలంలోని కృష్ణగిరి, కంబాలపాడు, ఎరుకలచెర్వు ఉన్నత పాఠశాలల్లో బుధవారం జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులందరికీ చదవడం, రాయడం వచ్చేలా కృషి చేయాలన్నారు. వారికి అర్థమయ్యే రీతిలోనే భోదన చేయాలని సూచించారు. హెచ్ఎంలు పాల్గొన్నారు.

ఇ'స్మార్ట్' బోధన

- బోధనలో సరికొత్త విధానానికి శ్రీకారం
- ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీల ద్వారా పాఠాలు
- ఆసక్తికరంగా పాఠాలు వింటున్న విద్యార్థులు
- సామర్థ్యాల పెంపు సులభమైందంటున్న ఉపాధ్యాయులు

తుగ్గలి: ప్రభుత్వ పాఠశాలల్లో చాక్‌పీస్‌లకు కాలం చెల్లుతోంది. బ్లాక్‌బోర్డులు, చాక్‌పీస్‌లు అవసరం లేని డిజిటల్ బోధన అందుబాటులోకి వచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందుతోంది. పాఠశాలల్లో సమకూర్చిన వసతులు.. నూతన విద్యా విధానాలు విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంచేలా చేస్తున్నాయి. గతంలో అరకొర వసతుల మధ్య విద్యార్థులు చదువుకోగా.. ఇప్పుడు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించింది. దీనికి తోడు అత్యాధునిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారు. చదువుపై రోజురోజుకు ఆసక్తి పెంచడంతో సులభంగా పాఠాలు అర్థమవుతున్నాయని విద్యార్థులు చెబుతున్నారు.

మొదటివిడతగా నాడు–నేడు పాఠశాలల్లో..

మండల పరిధిలో 10 జెడ్పీ, 12 యూపీ, 44 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. తొలి విడతగా మన బడి నాడు–నేడు పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్‌ను సమకూర్చింది. దీని ద్వారా మండలంలో 7,320 మంది విద్యార్థులకు బోధన సాగనుంది. ఒక్కో పాఠశాలకు సుమారు రూ.10 లక్షలకు పైగా ఖర్చు చేసి వీటిని ఏర్పాటు చేస్తున్నారు. 1–5 తరగతులకు స్మార్ట్ టీవీలు, 6–10 తరగతులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ డిస్‌ప్లేలు ఏర్పాటు చేస్తున్నారు. మన బడి నాడు–నేడు ఎంపికైన పాఠశాలల్లో వీటిని అందు బాటులోకి తీసుకురాగా మిగిలిన పాఠశాలలకు త్వరలోనే అందజేయనున్నారు.



ఐఎఫ్‌పీల ద్వారా తుగ్గలి జెడ్పీ హెచ్ఎస్‌లో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు



పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ హెచ్ఎస్‌లో ఐఎఫ్‌పీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి(ఫైల్)

ఐఎఫ్‌పీల ఏర్పాటు

అభివృద్ధి చెందిన దేశాలు, పెద్దపెద్ద సిటీల్లో ఉండే కార్పొరేట్ స్కూళ్లలో మాత్రమే డిజిటల్ బోధన సాగుతోంది. ఈ విధానాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మన రాష్ట్రంలో అమలు చేస్తోంది. ఈ విధానం ద్వారా ఎంతటి క్లిష్టమైన పాఠ్యాంశాన్నైనా సులువుగా బోధించవచ్చు. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు బోధించేందుకు గాను పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ డిస్‌ప్లేలు ఏర్పాటు చేశారు. వీటిలో విద్యార్థులకు బోధనకు కావాల్సిన పరిజ్ఞానాన్ని పొందుపర్చారు. కాగా వీటిలో బోర్డుగానే కాకుండా డిజిటల్ స్క్రీన్‌గా ఉపయోగించే సౌలభ్యం ఉంది. ఈమేరకు వీటి ద్వారా బోధనతో విద్యార్థులకు సులభంగా పాఠాలు అర్థమవుతున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

సులభంగా అర్థమవుతున్నాయి



టీవీ ద్వారా పాఠాలు వినడం కొత్తగా ఉంది. డిజిటల్ బోధన ద్వారా చెప్పే పాఠాలు సులభంగా అర్థమవుతున్నాయి. వీడియోలు, కదిలే బొమ్మల ద్వారా పాఠాలు బోధిస్తుండడంతో ఎక్కువ కాలం గుర్తుండే అవకాశం ఉంది. కొత్త అంశాలు నేర్చుకోవాలనే ఉత్సాహం పెరిగింది.

– సుమలత, 9వతరగతి, తుగ్గలి

విద్యార్థుల సామర్థ్యాల పెంపు



డిజిటల్ బోధనతో విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందుతాయి. డిజిటల్ విద్యా బోధన ఫలితాలు మున్ముందు చాలా బాగుంటాయి. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్య అమలు చేయడంతో మరింత సమర్థంగా బోధించడానికి వీలవుతుంది.

– ఉపేంద్ర, జెడ్పీ హెచ్ఎస్ హెచ్ఎం, జొన్నగిరి

సద్వినియోగం అవుతున్నాయి

మండల పరిధిలో ఆరు జెడ్పీ, నాలుగు యూపీ స్కూళ్లలో మొత్తం 52 ఐఎఫ్‌పీలు వచ్చాయి. డిజిటల్ బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చారు. పాఠశాలల్లో బోధన కూడా సాగుతోంది. డిజిటల్ బోధనతో విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమవుతాయి. దశల వారీగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

– మాలతి, ఎంఈఓ–1, తుగ్గలి

వాల్మీకులకు అండగా ప్రభుత్వం

వెల్దుర్తి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాల్మీకుల పక్షాన ఉందని, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న తమ డిమాండ్‌ను కేంద్రంలో ఆమోదింపజేసే ప్రయత్నం చేయడం హర్షించదగ్గదని వాల్మీకి సంక్షేమ సంఘం మండల ప్రతినిధి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న తమ డిమాండ్‌ను ఏ ప్రభుత్వాలు పట్టించుకోలేదని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకుల జీవన స్థితిగతులు విచారించి, ఎస్టీ జాబితాలో చేర్చడంపై అసెంబ్లీలో తీర్మానం చేసిందన్నారు. బుధవారం ఏకంగా పార్లమెంట్ సమావేశాలలో రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఏపీ వాల్మీకి, బోయలను ఎస్టీలుగా గుర్తిస్తూ బిల్లు ఆమోదం కోరడం ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాల్మీకుల పక్షమేనని రుజువైందన్నారు. కేంద్రం స్పందించి బిల్లు ఆమోదించాలని డిమాండ్ చేశారు.

కేజీబీవీ తనిఖీ

మద్దికెర: ప్రభుత్వం సూచించిన నిబంధనలు తప్పని సరిగా పాటించాల్సిందేనని తహసీల్దార్ నాగభూషణం స్పష్టం చేశారు. ఆయన బుధవారం స్థానిక కస్తూర్బా విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రిజిస్టర్లు, ఆన్‌లైన్‌లో ఒకే విధంగా హాజరు ఉండాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. 33 మంది విద్యార్థులకుగాను 17 మంది సెలవులో, మరో 16 మంది దీర్ఘకాలిక సెలవులో ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయాన్ని ఎప్పటికప్పుడు జిల్లా అధికారులకు తెలియజేయాలని సూచించారు. దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్న విద్యార్థులను వారి తల్లిదండ్రులకు తెలియజేసి కేజీబీవీ నుంచి తొలగించి ఇతరులకు అవకాశం కల్పించాలన్నారు. ఆర్‌ఐ రవికుమార్, వీఆర్వో రంగస్వామి, ప్రిన్సిపాల్ జ్యోతి ఉన్నారు.

ప్రజా మద్దతు జగనన్నకే..



లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

దేవనకొండ: ప్రజల సంపూర్ణ మద్దతు సీఎం జగనన్నకే ఉందని, 2024 ఎన్నికల్లో మరోసారి అఖండ మెజార్టీతో జగనన్నను గెలిపించుకుందామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని గుండ్లకొండ, ఎం.కె.కొట్టాల గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రికి పూలమాలలతో స్వాగతం పలికారు. మంత్రి దాదాపు 500కు పైగా ఇళ్లను కలియదిరిగి ప్రభుత్వం నుంచి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజా సమస్యలను తెలుసుకుంటూ, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ ముందుకు వెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గుండ్లకొండ గ్రామ అభివృద్ధికి రూ.7.75 కోట్ల నిధులను ఖర్చు చేసి సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాలువలు, తాగు నీటి వసతి కల్పించినట్లు వివరించారు. గతంలో ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా వారి పార్టీ కార్యకర్తల కోసమే పనిచేశారని, ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతిఒక్కరికీ నేరుగా ఇంటివద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. మంత్రి సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, మండల కన్వీనర్ మల్లికార్జున, కో–కన్వీనర్ కబీర్‌దాసు, గుండ్లకొండ సర్పంచ్ కాశింబీ, నాయకులు అరుణ్‌కుమార్, ప్రేమనాథ్‌రెడ్డి, నిజాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గఫూర్, ప్రభాకర్‌రెడ్డి, విక్రాంత్‌రెడ్డి, రాంభీంనాయుడు, ఎంపీడీఓ గౌరీదేవి, ఎస్‌ఐ భూపాలుడు, తహసీల్దార్ వెంకటేష్‌నాయక్, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఆలూరు: పల్లెల ప్రగతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తున్నామని మంత్రి గుమ్మనూరు జయరాం స్పష్టం చేశారు. దేవనకొండ మండలం గుండ్లకొండ, ఎంకే కొట్టాల గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అవినీతి, అక్రమాలకు పాల్పడడం వల్లే గత ఎన్నికల్లో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, నిలకడ లేని వ్యక్తిత్వం వల్లే జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌ను ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ నాయకులు ప్రకటిస్తున్న పథకాలను చూస్తే పగటి వేషగాళ్ల మాదిరిగా కనిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో అన్ని వర్గాలకు మేలు చేశామని, ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించామని వివరించారు. సంక్షేమ పాలన సాగిస్తున్న జగనన్న వైపే జనం ఉన్నారని, రానున్న ఎన్నికల్లో మరోసారి అఖండ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు హొళగుందలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

హొళగుంద: మంత్రి గుమ్మనూరు జయరాం గురువారం హొళగుందలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకుడు ఈశా, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ప్రజల ముంగిటకే సంక్షేమ పాలన

తుగ్గలి: ప్రజల ముంగిటకే సంక్షేమ పాలనను తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం సాయంత్రం నునుసరాల్ల, నల్లగుండ్లలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా? అని ఆరా తీస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తోందన్నారు. సీఎం పేదల పక్షాన నిలబడి సంక్షేమాన్ని చేరువ చేస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు.



నునుసరాల్లలో వృద్ధుడికి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో సంక్షేమం నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే చేరుతుందన్నారు. అలాంటి వ్యవస్థలపై తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్నాథరెడ్డి, రామచంద్రారెడ్డి, నాగేష్, గోపాల్‌రెడ్డి, విజయమోహన్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, రంగారెడ్డి, శ్రీనివాసరెడ్డి, చాంద్‌భాష, నాగేశ్వరరావు, అశోక్, మునిరెడ్డి, ఈశ్వరరెడ్డి, రమణారెడ్డి, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

భయం భయంగా విధులు

ఆలూరు రూరల్: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి తహసీల్దార్ కార్యాలయంలో వర్షపు నీరు కారుతుండడంతో సిబ్బంది భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. బ్రిటీష కాలంలో నిర్మించిన ఆఫీసు కావడంతో పైకప్పు కుంగిపోయింది. ఎప్పుడు కూలుతుందోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఏటా వర్షాకాలం కార్యాలయంలో పనిచేయాలంటే ఇబ్బందిగా మారిందని సిబ్బంది వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయాన్ని మరో భవనంలోకి మార్చాలని కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

కృష్ణగిరి: అమకతాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మధుసూదన్‌నాయుడు బుధవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పత్తికొండలోని పార్టీ కార్యాలయంలో ఆయన్ను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరుతున్నట్లు మధుసూదన్‌నాయుడు తెలిపారు. అమకతాడు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. నాయకులు కృష్ణారెడ్డి, బాల మిన్నెల్ల, బూడిద శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

పైర్లను కాపాడుకోవాలి

గోనెగండ్ల: భారీ వర్షాల నుంచి రైతులు పైర్లను కాపాడుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మిగనూరు ఏడీఏ ఎస్.మహమ్మద్ ఖాద్రి, గోనెగండ్ల ఏఓ హేమలత సూచించారు. బుధవారం వారు మాట్లాడుతూ.. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అధిక తేమ వల్ల పత్తి, మిరప, ఉల్లి పైర్లకు వేరుకుళ్లు సోకుతోందని, నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ (బ్లైటాక్స్, బ్లూ కాపర్) 3 గ్రాములు లేదా కార్బెన్డజీమ్ (బావిస్టిన్) 2 గ్రాములు లీటరు నీటికి కలుపుకొని మొక్క మొదలు తడిసేలా పిచికారీ చేయాలన్నారు. అలాగే ట్రైకోడర్మా విరిడి వంటి జీవ శిలీంధ్ర నాశినులు 2 కిలోలు, 180 కిలోలు బాగా మగ్గిన పశువుల ఎరువు, 20 కేజీ వేప పిండిలో కలుపుకొని వారం రోజులు మగ్గనిచ్చి ఒక ఎకరం పొలంలో చల్లుకోవాలన్నారు. వర్షం తగ్గిన తరువాత ఎకరా పొలంలో 30 కిలోల యూరియా, 25 కిలోల పోటాష్ ఎరువులను పైపాటుగా వేసుకోవాలన్నారు.

వర్షాలపై అప్రమత్తం

ఎమ్మిగనూరురూరల్: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మరో మూడు రోజులు భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ సూచనల మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పాత మిద్దె ఇల్లు ఉన్నవారు వర్షాలు తగ్గే వరకు ఇతర ప్రాంతాల్లో ఉండాలని సూచించారు.

ఆలూరు రూరల్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వీఆర్వోలు ఆయా గ్రామ ప్రజలను అప్రమత్తం చేయాలని మండల తహసీల్దార్ రామాంజనేయులు సూచించారు. ఆయన మండలంలోని ఆలూరు–చిప్పగిరి రహదారిలో ఉన్న కళ్లె వంకను పరిశీలించారు. వంతెన కింది భాగంలో పేరుకుపోయిన మట్టి, చెత్తను తొలిగించాలని ఉపాధి హామీ పథకం సిబ్బందిని ఆదేశించారు. వాహనదారులు, రైతులు వంకలు, వాగులు దాటేటప్పుడు జాగ్రత్త వహించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సేవలందించేలా ప్రత్యేక బృందం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆపదలో ఉన్న వారు సంబంధిత వీఆర్వో, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇదిలాఉండగా తుపాను ప్రభావంతో మంగళవారం సాయంత్రం 3 గంటల నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. ప్రజలు బయటికి వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

డ్రైవర్లు కంటి చూపు కాపాడుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: ఆటో, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు నడిపే డ్రైవర్లు కంటి చూపు పట్ల జాగ్రత్తలు పాటించాలని ఆర్టీఓ నాగేంద్ర, ఏఎంవీఐ సుధాకర్ రెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ శాఖ కంటి వైద్య నిపుణులు జెషన్ అహమ్మద్ సూచించారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని క్లస్టర్ హెల్త్ సెంటర్‌లో ఆర్టీసీ బస్సులు, ఆటో, జీపు, ట్రాక్టర్లు తదితర వాహన డ్రైవర్లకు రవాణా శాఖ ఆధ్వర్యంలో కంటి వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కంటి పొరలు వచ్చిన వారికి శస్త్ర చికిత్సలు సైతం ఆరోగ్యశ్రీ ద్వారా చేయించనున్నట్లు తెలిపారు. కంటి అద్దాలు అవసరమైన వారికి వారం రోజుల్లోగా అందిస్తామన్నారు. వాహన డ్రైవర్లకు కంటి సమస్యలు వస్తే సత్వరం పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో 40 మంది డ్రైవర్లకు కంటి పరీక్షలు చేశారు. రవాణా శాఖ హెడ్‌కానిస్టేబుళ్లు నాగేశ్వరరావు, ఎండీ ఆజమ్, చెన్నప్పతో పాటు వైద్య సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న ఆర్టీఓ నాగేంద్ర, కంటి వైద్యుడు జెషన్ అహమ్మద్

అల్లర్లకు పాల్పడితే చర్యలు

గోనెగండ్ల: మొహర్రం వేడుకల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తిమ్మారెడ్డి హెచ్చరించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలన్నారు. పోలీసులు ఆయా గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు.

ప్రశాంతంగా జీవించండి

వెల్దుర్తి: గొడవలు, అల్లర్ల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ మల్లెపల్లె గ్రామస్తులకు సూచించారు. బుధవారం రాత్రి ఆయన గ్రామంలో పికెటింగ్‌ను పరిశీలించారు. అనంతరం పీర్ల చావిడి వద్ద గ్రామస్తులతో సమావేశమయ్యారు. పీర్ల పండుగలో అవాంఛనీయ సంఘటనలకు తావివ్వవద్దన్నారు. ఫ్యాక్షన్ వల్ల నష్టాలు వివరించారు. రోడ్డు ప్రమాదాలు, బాల్య వివాహాల నివారణ, సైబర్ క్రైమ్ గురించి అవగాహన కల్పించారు. వెల్దుర్తి సీఐ యుగంధర్, ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి వెంట ఉన్నారు.

రేపు మున్సిపల్ మీట్

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు బుధవారం తెలిపారు. కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

బాధ్యతగా పనిచేయండి

హొళగుంద: వలంటీర్లు విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం, ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే శాఖాపరమైన చర్యలతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి జీతాలు నిలిపి వేస్తామని పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ హెచ్చరించారు. బుధవారం ఆయన హొళగుందలో వలంటీర్లతో సమావేశం నిర్వహించి విధులు నిర్వహణపై పలు సూచనలు చేశారు.

పిల్లలను బడిలో చేర్పించండి

హాలహర్వి: బడిబయటి పిల్లలను బడిలో చేర్పించేందుకు అన్నిశాఖల అధికారులు చొరవ చూపాలని మండల ప్రత్యేకాధికారి రామాంజనేయులు సూచించారు. ఈ మేరకు బుధవారం గూళ్యం గ్రామంలో ఆయన పర్యటించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ, మండల శాఖ అధికారులతో సమావేశమై మాట్లాడారు.బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు అన్నిశాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. చదువు ప్రాముఖ్యతను విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓలు ఈరన్న, శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ ఆంతోనీ, ఏఈఆర్‌డీఓ మల్లికార్జున, హెచ్ఎం గోపి ఉన్నారు.

నందవరం: బడిబయటి పిల్లను బడి చేర్పించాలని ఎంపీడీఓ దశరథ రామయ్య, ఎంఈఓ–1 సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక జెడ్పీహెచ్ఎస్‌తో పాటు నాగలదిన్నెలోని జెడ్పీహెచ్ స్కూల్, ప్రైవేట్ స్కూలు రెయిన్‌బో, మంత్రాలయ టాలెంట్ స్కూళ్లలో పిల్లల ఆన్‌లైన్ నమోదును వారు పరిశీలించారు. మండలంలో బడి బయట పిల్లలు 2,800 మంది ఉన్నారని వారిలో ఇప్పటివరకు 500 మంది బడిలో చేరారన్నారు. మిగతా పిల్లలు బడిలో చేరేలా వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ వలంటీర్లు కృషి చేయాలన్నారు. ఎంఈఓ–2 రఘునాథ్ పాల్గొన్నారు.

కరువు ఛాయలను తుడిచేసిన వాన





వెల్దుర్తిలో వర్షంలో పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు,ఇంటి ఆవరణలో తలదాచుకున్న మూగజీవాలు

వెల్దుర్తి: మండలంలో ఒక్క వారంలోనే వర్షాలు లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్న దశ నుంచి సూర్యుడి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ముసురు కప్పిన మేఘాలు, చినుకులు, వర్షాలు 8 రోజులుగా కొనసాగుతున్నాయి. వారం కిందట మండలంలో కేవలం 30 శాతంలోపే పంటలు సాగవగా, ప్రస్తుతం 80 శాతం దాటింది. మరో రెండు మూడు రోజుల్లో వంద శాతం సాగు విస్తీర్ణం నమోదవుతుందని ఏఓ అక్బర్‌బాషా ఆశాభావం వ్యక్తం చేశారు. 8 రోజులుగా కురుస్తున్న చినుకులు సోమ, మంగళ, బుధ వారాల్లో వర్షంలా మారాయి. బుధవారం ఎడతెరిపి లేని వర్షం విద్యార్థులకు, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోంది. మూగజీవాలకు ఆకలి తిప్పలతోపాటు ఆవాసపు ఇక్కట్లు తప్పడంలేదు. రాబోవు మూడు రోజులు అధిక వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ సూచనల మేరకు ప్రభుత్వం రెడ్ అలర్ట్ ప్రకటించడంతోపాటు అధికారులందరూ అందుబాటులో ఉండాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ప్రజలు అప్రమత్తతతో ఉండాల్సిందిగా అధికారులు సూచనలు చేస్తున్నారు.



ఎమ్మిగనూరులో ఇమాంఖాశీం పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



అల్లుగుండులో దస్తగిరిస్వామి ఊరేగింపు ప్రారంభిస్తున్న దృశ్యం

పీర్ల ఊరేగింపు

ఎమ్మిగనూరుటౌన్: పీర్ల పండుగను పురస్కరించుకొని పట్టణంలోని పలు పీర్ల చావిడిలలో పీర్ల దేవుళ్లు కొలువుదీరారు. భక్తులు మొక్కులు తీర్చుకొంటున్నారు. బుధవారం స్థానిక జామియా మసీదు సమీపంలో పీర్ల చావిడిలో కొలువుదీరిన ఇమాంఖాశీం పీర్ల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వెల్దుర్తి: అల్లుగుండులో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు దస్తగిరిస్వామి సరిగెత్తు ఘనంగా నిర్వహించారు. విద్యుద్దీపాలతో అలంకరించిన పీర్ల చావిడిలో నిర్వాహకులు తలారి మాబుసాహెబ్, దస్తగిరి, మొహిద్దీన్, హుసేన్ కుటుంబ సభ్యులు స్వామివారికి ప్రత్యేకాలంకరణ గావించారు. చినుకులు కురుస్తున్నా గ్రామస్తులతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి విచ్చేసిన వేలాది భక్తులు స్వామివారికి ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. పలువురు చావిడి ముందు వెలిగించిన అగ్నిగుండం చుట్టూ సాహుసేన్ అంటూ చిందులు తొక్కారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు స్వామివారి సవారి గ్రామ పురవీధుల గుండా సాగింది. 10గంటల ప్రాంతంలో తిరిగి చావిడికి చేరుకుంది.